# డీఎస్సీ.. తుది అడుగులు ఇలా..

**ఆంధ్రా సివిల్స్‌గా వ్యవహరించే డీఎస్సీ.. నిర్వహణకు రంగం సిద్ధమైంది.. వివిధ కేటగిరీల్లో కలిపి భర్తీ చేయనున్న మొత్తం 21,343 పోస్టులకు దాదాపు.. మూడున్నర లక్షల మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.. టెట్ స్కోర్‌కు వెయిటేజీ.. సిలబస్‌లో మార్పులు చేర్పులు.. వెరసి నూతన విధానంలో నిర్వహించే డీఎస్సీకి.. 25 రోజుల గడువు మాత్రమే మిగిలి ఉంది.. అందుబాటులో ఉన్న ఈ సమయంలో.. తుది అడుగులు పకడ్బందీగా ఉంటేనే లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించవచ్చు. ఇందుకోసం అభ్యర్థులు అనుసరించాల్సిన వ్యూహాలు..**

నూతన విధానంలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు వెయిటేజీ ప్రకారం 20 మార్కులు కేటాయిస్తుండడంతో.. డీఎస్సీని 80 మార్కులకే పరిమితం చేశారు (గతంలో 100 మార్కులు ఉండేవి). మొత్తం 160 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కొక్క ప్రశ్నకు అర మార్కు కేటాయించారు. పరీక్ష సమయాన్ని కూడా రెండున్నర గంటలకు (150 నిమిషాలు) కుదించారు. అంతే స్థాయిలో సిలబస్‌లో మార్పులు చేశారు.

### పోటీ తీవ్రత ఇలా:

డీఎస్సీ దరఖాస్తు చేసుకున్న వివరాలను పరిశీలిస్తే..నోటిఫికేషన్‌లో ప్రకటించిన స్కూల్ అసిస్టెంట్ ఖాళీలు 5,695. వీటి కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య 3,35,004. అంటే ఒక్క పోస్టుకు సగటున 59 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. కేవలం డీఈడీ అభ్యర్థులనే ఎస్‌జీటీ పోస్టులకు అర్హులుగా పేర్కొనడంతో ఈ పోస్టులకు పోటీ పడేవారి సంఖ్య గణనీయంగా తగ్గింది. 11,602 పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల సంఖ్య 41,716. అంటే ఒక్క పోస్టుకు సగటున 3.6 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఈ వివరాలను బట్టి డీఈడీ అభ్యర్థులు కొద్దిగా కష్టపడితే ఉద్యోగం ఖాయం. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు మాత్రం సబ్జెక్ట్, జిల్లాల వారీగా విపరీతమైన పోటీ నెలకొంది.

### సిలబస్‌లో మార్పులు:

డీఎస్సీ ఎగ్జామ్ ప్యాట్రన్‌లో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ), స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) రెండు విభాగాల్లోనూ సిలబస్ పరంగా చాలా మార్పులు చేశారు. కొత్తగా కొన్ని విభాగాలను ప్రవేశపెట్టగా.. మరికొన్నింటిని తొలగించారు. గతంలో ఎస్‌జీటీకి సంబంధించి జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్, కంటెంట్-మెథడాలజీ (మ్యాథ్స్, సోషల్, సైన్స్), ఎడ్యుకేషనల్ సైకాలజీ అంశాల్లో ప్రశ్నలు ఉండేవి. నూతన విధానంలో సైకాలజీ స్థానంలో పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ అనే విభాగాన్ని ప్రవేశపెట్టారు. ఇంగ్లిష్‌తోపాటు తెలుగు భాషను కూడా చేర్చారు. ఎస్ఏలో కూడా.. జనరల్ నాలెడ్జ్, ఇంగ్లిష్, కంటెంట్-మెథడ్, ఎడ్యుకేషనల్ సైకాలజీ అంశాలపై ప్రశ్నలు ఉండేవి. ప్రస్తుతం ఎడ్యుకేషన్ సైకాలజీ స్థానంలో పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్ అనే విభాగాన్ని ప్రవేశపెట్టారు.

SAKSHI

## కంటెంట్‌తోపాటు:

సిలబస్‌ను ఒక్కసారి పరిశీలిస్తే కంటెంట్‌కు పెద్ద పీట వేసినట్లు తెలుస్తుంది. కంటెంట్‌కు కేటాయించిన మార్కులు ఎక్కువగా ఉండటంతో చాలా మంది అభ్యర్థులు ఈ విభాగంపైనే ఎక్కువ దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఇదే సమయంలో మిగిలిన టాపిక్స్ పట్ల నిర్లక్ష్యం తగదు. అభ్యర్థుల విజయాన్ని నిర్దేశించడంలో 'మెథడాలజీ', 'పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్' పాత్ర కూడా కీలకం. కాబట్టి ఈ అంశాల్లో సాధ్యమైనన్ని ఎక్కువ మార్కులు స్కోర్ చేసేలా ప్రయత్నించాలి. స్కూల్ అసిస్టెంట్ కంటెంట్ 6 నుంచి 10 తరగతుల అంశాలకు సంబంధించినవే కాబట్టి అందరూ సులభంగానే ప్రిపేర్ అవుతుంటారు. (ప్రశ్నల క్లిష్టత ఇంటర్మీడియెట్ స్థాయిలో ఉంటుంది). మిగిలిన అభ్యర్థుల కంటే పోటీలో ముందుడాలంటే మాత్రం మెథడాలజీ, పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, జనరల్ నాలెడ్జ్ అంశాల్లో ఎక్కువ స్కోర్ చేయాలి.

## మెథడాలజీ:

ఈ సారి డీఎస్సీ-స్కూల్ అసిస్టెంట్‌లో మెథడాలజీ ప్రాధాన్యత పెరిగింది. కేటాయించిన 16 మార్కులకుగాను 32 ప్రశ్నలు వస్తాయి. ఏ సబ్జెక్ట్ మెథడాలజీ అయినా తెలుగు అకాడమీ పుస్తకాన్ని ప్రతిపాదికగా తీసుకోవాల్సి ఉంటుంది. గతంతో పోల్చితే డీఎస్సీలో ప్రశ్నల కాఠిన్యత స్థాయి పెరిగింది. ఇంతకు ముందు ప్రశ్నలు డైరెక్ట్‌గా ఉండేవి (జ్ఞాన సంబంధ ప్రశ్నలు). కానీ ఇటీవల నిర్వహించిన టెట్ ప్రశ్నాపత్రాలను పరిశీలిస్తే..ప్రశ్నల సరళి మారుతుందనే అంశాన్ని గమనించవచ్చు. కాబట్టి మొదట మెథడాలజీలోని భావనలను అవగాహన చేసుకుంటే ఈ అంశంపై పట్టు సాధించవచ్చు. ఆ భావనల ఆధారంగా అన్వయ పద్ధతిలో ప్రశ్నలు ఇచ్చినా..సమాధానం ఇచ్చే విధంగా ప్రాక్టీస్ చేయాలి. ప్రశ్నల తీరును గమనిస్తే.. మెథడాలజీ భావనలను సన్నివేశాలకు జోడించిన అప్లికేషన్ బిట్స్ ఎక్కువగా అడుగుతున్నారు. ఇప్పటికే అభ్యర్థులు మెథడాలజీ భావనలను చదివి ఉంటారు. కాబట్టి ప్రతి రోజూ వివిధ మాదిరి ప్రశ్నపత్రాలను, గత డీఎస్సీ, టెట్ ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయడం మంచిది. దీని వల్ల ప్రశ్నల సరళి తెలుస్తుంది. అప్లికేషన్ బిట్స్‌ను ఆన్సర్ చేసేటప్పుడు సరైన రీతిలో ఆలోచించటం అలవాటవుతుంది. మరో కీలకాంశం.. ప్రశ్నలను క్షుణ్నంగా చదవాలి. ప్రశ్నను పాజిటివ్‌గా ఇచ్చారా? నెగిటివ్‌గా ఇచ్చారా? అనేది గమనించాలి. నెగిటివ్ అంటే కింది వాటిలో లక్ష్యానికి 'సంబంధించని' ప్రవచనం అని అడిగితే తొందరలో 'సంబంధించిన' అని అర్థం చేసుకొని తప్పు సమాధానాన్ని ఎంచుకోనే అవకాశం ఉంది. ఇలాంటి ప్రశ్నలను ఎంచుకొని ప్రాక్టీస్ చేయడం మంచిది.

ఏ సబ్జెక్ట్ మెథడాలజీలోనైనా దాదాపుగా 10 అధ్యాయాలుంటాయి. అప్లికేషన్ తరహా ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్న అధ్యాయాల్లోంచి ప్రశ్నలు ఎక్కువగా ఇవ్వడాన్ని గమనించవచ్చు. అదేవిధంగా లక్ష్యాలు, స్పష్టీకరణలు, బోధన పద్ధతులు, పాఠ్యప్రణాళిక, మూల్యాంకనం, బోధనోపకరణాలు వంటి అధ్యాయాల్లోని బిట్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. మెథడాలజీలో ఒక్కొక్క కఠినమైన యూనిట్‌ను ఎంచుకొని గ్రూప్ డిస్కషన్ చేయడం వల్ల కూడా అవగాహన సులభమవుతుంది.

## కంటెంట్:

అభ్యర్థులందరికీ ప్రిపరేషన్‌లో సులభమైన విభాగం కంటెంట్. అభ్యర్థులందరికీ డిగ్రీ స్థాయి నాలెడ్జ్ ఉంటుంది. కాబట్టి 6-10 తరగతుల పాఠ్యపుస్తకాలకు సంబంధించి కంటెంట్ సులభంగా అర్థం అవుతుంది. పాఠ్యపుస్తకాల్లో ప్రతి పాఠాన్ని ఏ వాక్యం వదిలి పెట్టకుండా ఇప్పటికే పూర్తి చేసి ఉండాలి. కంటెంట్ ప్రిపరేషన్ సమయంలో ఎక్కువగా తెలిసిన అంశాలు ఉంటాయి కాబట్టి మానసిక శ్రమ అంతగా ఉండదు. కాబట్టి ఈ కంటెంట్ ప్రిపరేషన్‌కు రోజు వారీ షెడ్యూల్‌లో చివరి దశ కేటాయించాలి. బిట్స్ పదే పదే గ్రూప్ డిస్కషన్ చేయటం వల్ల రివిజన్ అవుతుంది. సారుప్యత ఉన్న పాఠ్యాంశాలను అన్నింటిని ఒక చోట రాసుకొని ప్రిపేర్ కావాలి.

## పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్:

విజయాన్ని నిర్దేశించే కీలక విభాగం పర్‌స్పెక్టివ్ ఇన్ ఎడ్యుకేషన్ అని చెప్పొచ్చు. విద్యను చారిత్రక, తాత్విక, మనోవైజ్ఞానిక, సామాజిక, సమకాలీన దృక్పథంతో పరిశీలించడమే పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్. ఇందులో ఐదు యూనిట్లు ఉన్నాయి. ఇందులో విద్య చారిత్రక నేపథ్యం, ఉపాధ్యాయ సాధికారత, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, పర్యావరణ విద్య, జనాభా విద్య, సహిత విద్య, ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, బాలల హక్కులు, మానవ హక్కులు, నేషనల్ కరిక్యులం ఫ్రేమ్ వర్క్-2005కు సంబంధించిన అంశాలు ఉంటాయి. ఎస్‌జీటీ/ఎస్ఏలకు ఒకే రకమైన సిలబస్ నిర్దేశించినప్పటికీ.. ప్రశ్నల క్లిష్టతలో తేడా ఉంటుంది. డీఈడీ అభ్యర్థులకు పేపర్-4 లో, బీఈడీలో కూడా ఫౌండేషన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్, స్కూల్ అడ్మినిస్ట్రేషన్ పుస్తకాల్లో సంబంధిత అంశాల ప్రస్తావన కొంత వరకు ఉంటుంది. మిగిలిన సిలబస్ కోసం.. అంశాల వారీగా మార్కెట్లో లభించే స్టాండర్డ్ పుస్తకాల నుంచి నోట్స్ ప్రిపేర్ చేసుకోవాలి.

## ఎస్‌జీటీ:

ఎస్ఏతో పోల్చితే.. ఎస్‌జీటీ పోస్టులకు పోటీ తక్కువగా ఉండటం డీఈడీ అభ్యర్థులకు కలిసొచ్చే అంశం. మ్యాథ్స్, సైన్స్, సోషల్ మూడు సబ్జెక్టులుగా ఉండే కంటెంట్.. అత్యంత సులభమైన విభాగం. ఇక్కడ కీలకాంశం.. తమ నేపథ్యానికి చెందని పాఠ్యాంశాలు (ఉదాహరణకు.. బయాలజీ అభ్యర్థులు గణితం, సోషల్ స్టడీస్ చదవడం) చదివేటప్పుడు కొంత ఇబ్బందికి గురవడం సహజం. అభ్యర్థులు ఇప్పటికే కనీసం డిగ్రీ స్థాయి అవగాహన కలిగుంటారు కాబట్టి ప్రాథమిక, ప్రాథమికోన్నత తరగతుల పాఠ్యాంశాల విషయంలో సిలబస్‌ను అనుసరిస్తూ.. ప్రతి పాఠ్యాంశం వెనుక ఇచ్చిన బిట్స్‌ను ఔపోసన పడితే సులభంగానే ఈ సమస్యను అధిగమించొచ్చు. సోషల్, సైన్స్ అభ్యర్థులు మాత్రం గణితం విషయంలో కొంత జాగ్రత్తగా ఉండాలి. వీరు స్కూల్ ఎడ్యుకేషన్ తర్వాత ఎక్కువగా మ్యాథ్స్‌ను ఫాలో కాకపోవడమే దీనికి కారణం. దీనికి ఏకైక పరిష్కారం.. ప్రాక్టీస్‌కు ఎక్కువగా ప్రాధాన్యత ఇవ్వడం. సూత్రాలు, మౌలికాంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలి. అప్లికేషన్ మెథడ్‌ను పెంచుకోవాలి.

ఇంపార్టెంట్ అంటూ కొన్ని పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా అన్ని పాఠ్యాంశాల మీద దృష్టి సారించాలి. మెథడాలజీ విషయానికొస్తే.. డీఈడీ సిలబస్ నుంచి ప్రశ్నలు ఉంటాయి.

బోధనా లక్ష్యాలు, అభ్యసనానుభవాలు, మూల్యాంకనం, బోధనా పద్ధతులు, బోధనోపకరణాలు అంశాలను కంటెంట్‌లోని పాఠ్యాంశాలకు అన్వయించుకుని ప్రిపరేషన్ సాగించాలి. ఏయే సబ్జెక్ట్‌కు ఏ పద్ధతి సరిపోతుందనే అంశంపై అవగాహన పెంచుకోవాలి. లాంగ్వేజెస్‌లో చేర్చిన తెలుగు, ఇంగ్లిష్ భాషలు కంటెంట్ బేస్డ్ కాదు. ఆయా భాషల్లో అభ్యర్థుల సామర్థ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉండే అవకాశం ఉంది. టెట్‌లో లాంగ్వేజెస్ కోసం ఏ విధంగా ప్రిపేరేషన్ సాగించారో.. ఆ ప్రిపరేషన్ సరిపోతుంది.

**జనరల్ నాలెడ్జ్:**

స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ రెండు పేపర్లలోను ఈ విభాగానికి 10 మార్కుల చొప్పున కేటాయించారు. గత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే.. కరెంట్ అఫైర్స్‌తోపాటు స్టాండర్డ్ జీకేకు కూడా పెద్ద పీట వేశారు. కరెంట్ అఫైర్స్ కోసం.. పరీక్ష తేదీకి ఏడాదికి ముందు జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో చోటు చేసుకున్న పరిణామాలు, వార్తల్లోని వ్యక్తులు, సమావేశాలు, క్రీడలు-విజేతలు, వివిధ సర్వేలు, జనాభా గణాంకాలు వంటి అంశాలపై ప్రశ్నలుంటాయి. స్టాండర్డ్ జీకే కోసం.. వివిధ చారిత్రక కట్టడాలు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, వివిధ తెగలు-సంస్కృతి, రాజధానులు, కరెన్సీ, సముద్రాలు-నదులు, హైకోర్టు, సుప్రీంకోర్టు, స్వాతంత్ర్యోద్యమం, సైన్స్ అండ్ టెక్నాలజీ తదితర అంశాలపై ప్రశ్నలు ఉంటాయి.

## జనరల్ టిప్స్

- సాధ్యమైనన్నీ మాక్ టెస్ట్‌లను రాయాలి. వీటి ఫలితాలను విశ్లేషించుకోవాలి.
- వీలైతే అధ్యాయాల వారీగా ప్రాక్టీస్ టెస్ట్ రాయడం కూడా లాభిస్తుంది.
- గతంలో నిర్వహించిన డీఎస్సీ, టెట్ ప్రశ్నపత్రాలను విధిగా సాల్వ్ చేయాలి.
- ఇప్పటికే ప్రిపరేషన్ పూర్తి చేసి ఉంటారు కాబట్టి రివిజన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- రివిజన్‌ను కూడా గ్రూప్ డిస్కషన్ తరహాలో చేయడం లాభిస్తుంది. మెథడాలజీ విషయంలో ఇది చక్కగా ఉపకరిస్తుంది.
- కొత్త టాపిక్స్‌ను ఎట్టి పరిస్థితుల్లోను చదవకూడదు.
- వివిధ మెటీరియల్స్‌పై ఆధారపడకుండా తెలుగు అకాడమీ పుస్తకాలకే పరిమితం కావాలి.
- తెలుగు అకాడమీ రూపొందించిన బిట్ బ్యాంక్‌ను కూడా అధ్యయనం చేయాలి.
- పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాల చివరన ఇచ్చిన బిట్స్‌ను ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.
- కంటెంట్‌లోని ప్రశ్నలకు సమాధానాలను తక్కువ సమయంలో గుర్తించేలా ప్రాక్టీస్ చేయాలి. దీని వల్ల కొద్దిగా కష్టంగా ఉండే పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్, మెథడాలజీ విభాగాల్లో ఆలోచనతో ఆప్షన్‌ను ఎంచుకునే వెసులుబాటు లభిస్తుంది.
- కీలకమైన ఈ చివరి దశలో ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మవిశ్వాసంతో ఉండాలి.